**కథ**

''ఈ లెటర్ నీకందిస్తున్నది నా కొడుకు రవీంద్ర. వాడికి ట్రాన్సేషియా కంపెనీలో సర్వీస్ ఇంజనీర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి లెటరొచ్చింది. ఆ కంపెనీ జోనల్ మేనేజర్ నీకు దూరపుబంధువని గతంలో నువ్వు నాకు చెప్పినట్టు గుర్తుంది. నీకు నా కుటుంబపు పరిస్థితి తెలుసు. రవీంద్ర గురించి తెలుసు. కాబట్టి నీకు చేతనైన సహాయం చెయ్యగలవు. శ్రమ ఇస్తున్నందుకు మరోలా భావించకు. మీ ఇంట్లో అందరినీ అడిగినట్లు తెలుపగలవు"

-వివేకానంద్.



# సిఫారసు

**ఎం.వెంకటేశ్వరరావు**

ధర్మసంకటంగా తోచింది రాజేశ్వర్రావుకి. అతనెప్పుడూ తనకోసంగానీ, తన వాళ్ళకోసం గానీ ఎవరి దగ్గరికీ రికమండేషన్ కోసం వెళ్ళలేదు. అలా రికమండేషన్ ద్వారా పొందటం తన పాలసీకి విరుద్ధంగా భావిస్తాడు. కానీ చిన్నప్పట్నుంచీ ఒకే ఊర్లో పుట్టి, కాలేజీ వరకూ ఒకేచోట కలిసి చదువుకున్న ప్రాణస్నేహితుడు వివేకానంద్, పిల్లల చదువులతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న అతనికి, పెద్దకొడుకు రవీంద్రకి ఉద్యోగం రావటం చాలా అవసరం

''సరే రవీ! రేపే గదా ఇంటర్వ్యూ. నువ్వు బాగా ప్రిపేరవ్వు. వాళ్ళడిగే ప్రశ్నలన్నిటికీ ధైర్యంగా జవాబులు చెప్పు. మిగిలిన విషయాలు నేను చూసుకుంటాను. ఆల్ ది బెస్ట్'' అన్నాడు రాజేశ్వర్రావు.

★ ★ ★

మరుసటి రోజు సాయంత్రం రవీంద్ర పళ్ళు, స్వీట్స్ తీసుకొని రాజేశ్వర్రావు ఇంటికొచ్చాడు.

''ఇంటర్వ్యూ అయిన వెంటనే రిజల్ట్స్ అనౌన్సు చేశారంకుల్. నేను సెలక్టయ్యాను'' అని సెలక్షన్ కార్డు చూపి, ''త్వరలో అప్పాయింట్‌మెంట్ లెటరు పంపుతామన్నారు. మీరు చేసిన ఈ సహాయానికి చాలా థాంక్స్'' అని స్వీట్సు, పళ్ళూ టీపాయ్ మీదుంచాడు కృతజ్ఞతగా.

''కంగ్రాట్స్ రవీ! నా సిఫారసు వలనే నీకు ఉద్యోగం వచ్చిందనుకుంటున్నావు. నీ గురించి నేనెవరి దగ్గరికీ రికమండేషన్‌కి వెళ్ళలేదు. ఈ ఉద్యోగానికి రిటెన్ టెస్ట్‌లో పాసయిన నీకు, ఇంటర్వ్యూ దగ్గర కొచ్చేసరికి తెలియని భయమేదో ఆవహించింది. ప్రస్తుతపు కాంపిటీషన్లో సక్సెస్ కాలేనేమోనన్న అపోహ. కానీ నీకు మెరిట్లోనే ఇంజనీరింగ్ సీటొచ్చిందనీ, కష్టపడి మంచి ర్యాంకుతో పాసయ్యావనీ నీకు తెలుసు, నాకూ తెలుసు. చూడు రవీ! నీలో ప్రతిభని నువ్వు గుర్తించి, ఇతరులు గుర్తించేలా చెయ్యాలి. అప్పుడే 'జయించగలను' అనే ఆత్మవిశ్వాసం వృద్ధి అవుతుంది. నిజానికి నీ ఉద్యోగం గురించి నేనే ప్రయత్నమూ చెయ్యలేదు. అయితే మొదటే నీకు ఆ విషయం చెప్పి నిన్ను నిరుత్సాహ పరచదల్చుకోలేదు. కానీ నీ వెనక నా సపోర్టు అండగా ఉంటుందన్న మనోబలంతో, నువ్వు ఇంటర్వ్యూ ధైర్యంగా ఫేస్ చేసి, మెరిట్లో ముందొచ్చావు.

మనలో నిద్రాణమై ఉండే తెలివితేటలకి మనోబలం, ఆత్మవిశ్వాసం అనే సిఫారసులను జోడించి ముందుకు పోగలిగితే, ఎక్కడో ఒకచోట విజయం మనకోసం వేచి ఉంటుంది.

ఎనీవే! కంగ్రాట్స్ వన్సగైన్. ఈ పార్శిలు మీ నాన్నగారికివ్వు'' అని వివేకానంద్ కోసం ఢిల్లీ నుండి తెచ్చిన స్వెట్టరు అతనికి అందజేశాడు రాజేశ్వర్రావు.

ఉద్యోగం వచ్చిన ఉత్సాహం, రాజేశ్వర్రావు అందించిన మనోధైర్యంతో వడివడిగా బయటకొచ్చాడు రవీంద్ర.